# లుంబినీపార్క్‌లో రక్షణ చర్యలకు శ్రీకారం

ఎట్టకేలకు కదిలిన
టూరిజం శాఖ యంత్రాంగం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లుంబినీపార్క్ అధికారుల అధికారుల నిర్లక్ష్యంతో ఇటీవల వరుసగా ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలను 'లుంబినీ పార్క్‌లో అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం' అనే శీర్షికతో 'ప్రజాపక్షం' బయటపెట్టింది. ఈ కథనంపై టూరీజం శాఖ, హెచ్‌ఎండిఎ అధికారులు స్పందించారు. హుస్సేన్‌సాగర్, లుంబినీపార్క్ వద్ద చోటుచేసుకున్న రెండు ఘటనలు కూడా పర్యాటక శాఖ పరిధిలోకి వస్తాయని హెచ్‌ఎండిఎ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. వరుస ప్రమాదాలపై తెలంగాణ రాష్ట్ర టూరీజం అభివృద్ధి సంస్థ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. లుంబినీపార్క్‌లో నెలకొన్న నిర్లక్ష్య చర్యలను సమీక్షించారు. సిసిటివిలను పర్యవేక్షించడంతో పాటు టికెట్ కౌంటర్ల వద్ద సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఒంటరిగా వచ్చే మహిళలు, పురుషులకు బోటింగ్ టిక్కెట్లు ఇవ్వరాదని, వారి కదలికలను సిసిటివి ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. అలాగే బోటింగ్ పాయింట్‌తో పాటు బోటింగ్‌లో కూడా సిసి కెమెరాలను సోమవారం పర్యవేక్షించారు. ప్రతి బోటింగ్‌లో సిసి కెమెరాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. దీంతో పాటు బోటింగ్‌లో ఎంత మంది వెళ్తున్నారు, తిరిగి వచ్చే సమయంలో ఎంత మంది ఉన్నారు అనే విషయంపై దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ప్రయాణికుడికి లైఫ్ జాకెట్‌లు ధరించే విధంగా చూడాలని సూచించారు. టికెట్లు ఇచ్చే ప్రదేశంలో, బోటింగ్ పాయింట్ వద్ద, బుద్ధ పూర్ణిమ వద్ద సిసికెమెరాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. దీంతో సిబ్బంది హుటాహుటీనా సోమవారం సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి బోట్‌లో కూడా లైఫ్ జాకెట్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.




ప్రజాపక్షం ఎఫెక్ట్

## ప్రజావాణికి 80 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ నగర పాలక సంస్థ(సిఎంసి) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 80 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం, రెవెన్యూ, విజిలెన్స్ తదితర విభాగాలకు సంబంధించిన అంశాలను పౌరులు నేరుగా సంబంధిత విభాగాధిపతుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సిఎంసి అదనపు కమిషనర్ గీతా రాధిక, చీఫ్ సిటీప్లానర్ బి.వెంకన్న, చీఫ్ ఇంజనీర్ శ్రీలక్ష్మి, అదనపు చీఫ్‌సిటీ ప్లానర్ శైలజ పాల్గొన్నారు.

## ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సహకరించాలి






హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి
ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్)కు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు. భారత ఎన్నికల సంఘం ఇటీవల తెలంగాణ రాష్ట్రానికి ప్రకటించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ నేపథ్యంలో జిహెచ్‌ఎంసి కమిషనర్, అదనపు కమిషనర్ (ఎన్నికలు) చంద్రకళతో కలిసి సోమవారం జిల్లా స్థాయి రాజకీయ పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హైదరాబాద్ జిల్లాకు చెందిన వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. రాబోయే ఎన్నికల కార్యకలాపాలకు ముందు పారదర్శకమైన, కచ్చితమైన, సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేయడంలో ప్రత్యేక విస్తృత సవరణ ప్రక్రియ కీలకమని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కర్ణన్ కోరారు. ఓటర్ల జాబితా వివరాల ధృవీకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఎలు) కీలక పాత్ర పోషిస్తారన్నారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రతి పోలింగ్ కేంద్రానికి వీలైనంత త్వరగా తమ బిఎల్ఎలను నియమించాలని రాజకీయ పార్టీలను కోరారు.

## జలమండలి కార్మికుల భవిష్యత్తు కోసం..
## ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించండి : రాజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలి ఉద్యోగ, కార్మికుల సమస్యలపై ఐఎన్‌టియుసి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ దశాబ్దాలుగా పోరాటం చేస్తుందని, జలమండలి కార్మికుల భవిష్యత్తు కోసం జూన్ 6న జరిగే ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకు ఓటు వేసి, ఎంప్లాయిస్ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ వనస్థలిపురం పరిధిలోని సాహెబ్‌నగర్ హెచ్‌ఎండబ్ల్యుఎస్ ఎస్‌బి కార్యాలయంలో సోమవారం మొగుళ్ళ రాజిరెడ్డితోపాటు మాజీ కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ జలమండలి కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, భవిష్యత్తు కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరంలో 300 వార్డుల విస్తరణతో పెరిగిన పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని జలమండలి



లోని అన్ని విభాగాల్లో పోస్టుల అప్‌గ్రేడేషన్ చేసి, ఉద్యోగులకు న్యాయమైన ప్రమోషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ధర్పల్లి రాజశేఖర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన లేదా వికలాంగులైన ఉద్యోగులకు రూ.50 లక్షల పరిహారం, కుటుంబ సభ్యులకు తక్షణ కరుణా నియామకాలు కల్పించే దిశగా పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కె.రాజ్‌రెడ్డి, టిజెఎంఇయు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్ , నేతలు ఇ.చంద్రశేఖర్, సైద్ అక్తర్ అలీ, బి.జై రాజ్, కె.ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాల సాధికారతే ధ్యేయంగా జిహెచ్‌ఎంసి చేపట్టిన 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' (పిపిపిపి) కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కొత్త స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జి) ఏర్పాటుకై మురికివాడల స్థాయిలో సమావేశాలు నిర్వహించడం అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈప్రత్యేక చొరవలో భాగంగా జిహెచ్‌ఎంసి పరిధిలోని మెట్టుగూడ, రాజేంద్రనగర్ సర్కిళ్లలో మొత్తం 105 మురికివాడల స్థాయి సమావేశాలను సోమవారం జరిపామని తెలిపారు. డిప్యూటీ కమిషనర్లు (డిసిలు), రిసోర్స్ పర్సన్లు (ఆర్‌పిలు) స్థానిక నివాసితులు, సామాజిక నాయకులు, అధికారులు, మహిళా బృందాలను భాగస్వాములను చేస్తూ ఈ సమావేశాలను నిర్వహించారు. స్వయం సహాయక బృందాల ద్వారా లభించే ప్రయోజనాలను,



ఆదాయాన్నిచ్చే వినూత్న అవకాశాలను క్షేత్రస్థాయిలో మహిళలకు వివరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్లు, డిప్యూటి కమిషనర్లకు స్పష్టమైన సూచనలు చేశారు. సమావేశాలకు స్థానిక మహిళలు, నివాసితుల నుండి సానుకూల స్పందన లభించిందన్నారు. సామూహిక అభివృద్ధి, స్వావలంబన సాధనే లక్ష్యంగా కొత్త బృందాలను ఏర్పాటు చేయడానికి మహిళలు తీవ్ర ఆసక్తిని కనబరిచారు. సమ్మిళిత వృద్ధి, సుస్థిర సమాజవృద్ధే ధ్యేయంగా మహిళల భాగస్వామ్యంతో విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు.

## ఆకాల వర్షంతో అపార నష్టం..

నేల రాలిన మామిడి..తడిసిన ధాన్యం
కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న అన్నదాతలు




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సోమవారం సాయంత్రం కురిసిన ఆకాల వర్షాలతో అపార నష్టం చోటు చేసుకుంది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి మామిడి కాయలు నేల రాలడంతోపాటు వర్షానికి వరిధాన్యం తడిసి పోవడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకువచ్చిన వరిధాన్యం వర్షానికి తడిసి పోవడంతో ఏమి చేయాలో తెలియక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో ముట్పూర్ రాజేందర్‌రెడ్డికి చెందిన 10ఎకరాల మామిడితోటలో ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలిపోవడం తో రైతు కన్నీరు పెట్టుకున్నారు. నేల రాలిన మామిడి కాయలను, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

## కష్టపడిన కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కష్టపడిన కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం షాద్‌నగర్ మున్సిపాలిటీలో కమీషనర్ సునీత అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నలుగురు కోఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నుకున్న కోఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాలువాలతో ప్రత్యేకంగా అభినంధించి సన్మానించారు. కాంగ్రెస్ యువ నాయకుడు సయ్యద్ ఖదీర్, మాజీ వార్డు సభ్యుడు వావిలాల సుజీవన్, మాజీ కౌన్సిలర్ లత శ్రీశైలం గౌడ్, గిద్దలూరనీ ఉషారాణిలను కోఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.





### ప్రణాళికాబద్ధంగా ఓటరు సవరణ ప్రక్రియ చేపట్టాలి

ఓటరు సవరణ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ అధ్యక్షతన కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అర్హులైన ఓటర్లను నమోదు చేయడంతోపాటు తప్పుల సవరణను చేయడంతోపాటు ఓట్ల తొలగింపు ప్రక్రియలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్, వైస్ చైర్మెన్ అందె మోహన్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు రఘునాయక్, ఇబ్రహీం, చెంది తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు బచ్చలి నరేష్, కొప్పునూరి ప్రవీణ్‌కుమార్, దిలీప్, సంతోషిబాయి, విశాల, చాకలి పెంటయ్య, అప్పిలు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యం బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ ఆవరణలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాలులో న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిసెట్టి, డిఆర్‌డిఒ, జిల్లా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలతతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోషకాహార మేళలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్‌లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుండి ప్రదర్శించిన పలు పదార్థాలను రుచి చూసి బాగున్నాయన్నారు. అంగన్వాడీ కేంద్రల ద్వారా గర్భిణులకు ఈ విధమైన పౌష్టికారాన్ని అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా కాపాడుకోగలుగుతామన్నారు. సేంద్రీయ పద్ధతిలో రైతులు పండించిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు గ్రామీణస్థాయి మహిళలకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం గర్భిణీలకు, శిశు సంక్షేమం కోసం అంగన్వాడీల ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుందన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా వ్యాధులు దరి చేరకుండా ఉంటామని చెప్పారు. మహిళా వారోత్సవాలలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, అంగన్వాడీ లబ్దిదారులు, తల్లితండ్రులతో వంటల పోటీలు నిర్వహించారు. సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కలిగిస్తూ స్టాల్స్‌లో తృణ ధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లకు సంబంధించిన ఆహారపదార్థాలను ప్రదర్శనలో పెట్టారు. హెల్త్ డిపార్ట్మెంట్ సహకారంతో గర్భిణి, బాలింతలు, కిశోర బాలికలకు రక్త హీనత పరీక్షలు నిర్వహించడం జరిగింది. గర్భిణిలకు, బాలింతలకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు, వంటల పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అధికారి శారద, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మహిళా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత, సిపిఓ సౌమ్య, ఇండస్ట్రీస్ జిఎం శ్రీలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, సిడిపిఓ శాంతికుమారి, జిల్లా లోని ఏడు ప్రాజెక్టుల సిడిపిఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, డిడబ్ల్యూఓ సిబ్బంది పాల్గొన్నారు.





## కోహెడలో భూబాధితుల ఆందోళన



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం తొర్రూర్ డివిజన్ పరిధిలోని కోహెడ సర్వే నెంబర్ 167/1 లో కోహెడ గ్రామానికి చెందిన రైతులు 70 ఏళ్ల నుంచి భూమి సాగు చేసుకుంటున్నారు. 39 ఎకరాల ఎక్సెల్ పట్టా భూమిలో 49 మంది రైతులు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ స్థలంలో గడ్డిఅన్నారం వ్యవసాయ పనుల మార్కెట్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. జూన్ మూడవ తేదీన మార్కెట్ కు శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేస్తుండడంతో సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్టు రెవెన్యూ అధికారులు భారీ పోలీస్‌బందోబస్తు జెసిబిలను ఏర్పాటు చేసి భూమిని చదును చేసేందుకు ప్రయత్నించారు. గ్రామస్తులకు, రైతులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొని జెసిపి ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో రైతులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. తమ భూమిలలో పోలీసు బందోబస్తు జెసిబిల ను పెట్టి ఎలా పనులు చేపడతారని కోహెడ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి, ఎల్బీనగర్ డిసిపి అనురాధ, అడిషనల్ డిసిపి కోటేశ్వరరావు, ఏసీపీ కాశిరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కోహెడ భూ బాధితులు మాట్లాడుతూ సాగులో ఉన్న రైతుల భూములను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా లాక్కోవడానికి చూస్తుందని మండిపడ్డారు. ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు కోసం తమ భూములను అన్యాయంగా చదును చేస్తూ రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై తాము కోర్టు నుంచి ఇంజెక్షన్ ఆర్డర్ కూడా తీసుకున్నామని,అయినా రెవెన్యూ అధికారులు, పోలీసు బందోబస్తు తో రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆరోపించారు. మా భూములను రక్షించేందుకు పోరాడుతామని తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోహెడ భూ బాధితుల సంఘం నాయకులు కందాల బలదేవరెడ్డి, కంబాలపల్లి ధనరాజ్, బండారు బాలరాజ్, బుద్ధబాబు కోహెడ గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.800 చెల్లించాల్సిందే

సిపిఐ నేత పుస్తకాల నర్సింగ్‌రావు




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉపాధి హామీ కూలీలకు రోజువారిగా రూ.800 చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో బికెఎంయు రంగారెడ్డి జిల్లా జనరల్ బాడి సమావేశాన్ని ఉపాధ్యక్షుడు జిల్లెల వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాన్ని పుస్తకాల నర్సింగ్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, డివిజన్ ఉపాధ్యక్షులు రాజునాయక్‌తోపాటు జి.యాదయ్య, కె.యాదగిరి, మంజుల, చిన్న చంద్రయ్య, శేఖర్‌రెడ్డి, గౌనికాడి జంగయ్య, షాబాద్ వెంకటేష్, చేవెళ్ల స్వరూప, షబ్బీర్, లింగం పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా వారోత్సవాలు



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని గాండ్లగూడ గ్రామంలో ఘనంగా మహిళా వారోత్సవాలు జరిగాయి. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ సరళ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారం తీసుకొవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఈశ్వర్, అంగన్‌వాడీ టిచర్లు ఎన్.శోభారాణి ,యం. సావిత్రి, టి. అంజమ్మ, అయాలు సాలమ్మ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అందుబాటులో పచ్చిరొట్టె విత్తనాలు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రైతులకు పచ్చిరొట్టె విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలానికి మొదటి విడతలో 332బ్యాగుల జీలుగలు, 200బ్యాగుల జనము విత్తనాలు వచ్చాయని, డిసిఎంఎస్ చించోడు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, ఫరుక్‌నగర్, మొగిలిగిద్దలో ఉన్న కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకంతో వ్యవసాయ విస్తరణ అధికారిణి సంప్రదిస్తు విత్తనాలు అంధించడం జరుగుతుందని తెలిపారు.

## అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/కేశంపేట:** సోమవారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ కర్నెకోట నరేష్ ఆధ్వర్యంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇలాంటి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు పామ్.వెంకట్‌రాంరెడ్డి, కొండేటి మాధవన్, కుమ్మరి అరవింద్, ఎఈ నర్సింగ్‌రావు, ఎపిఎం కవిత, సిసి అలివేలు, పంచాయతీ కార్యదర్శి స్వరూప్, మహిళా సంఘం అధ్యక్షరాలు పద్మమ్మ, కుమ్మరి శేఖర్, పోలేపోగు రాములు, కారోబార్ రాజు, రాము, వినోద్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

## లక్ష్మీదేవిపల్లి భూసేకరణకు నిధులు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితోనే రూ.583కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయించిందని లింగారెడ్డిగూడ ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ వివరించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## రాజీ ఒప్పందాన్ని అంగీకరించం:పెజెష్కియన్



**టెహ్రాన్:** ఇరాన్ గౌరవ మర్యాదలతో రాజీపడే ఒప్పందాన్ని తాము అంగీకరించబోమని ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ స్పష్టం చేశారు. అమెరికాతో చర్చలు తుది దశకు చేరాయని వార్తలు వెలువడిన నేపథ్యంలో పెజెష్కియన్ నుండి ఈ ప్రకటన వెలువడింది. ''శత్రువు దురాగతాలకు ఇరాన్ లొంగిపోదు, ఇరాన్ జాతి హక్కులను పూర్తిగా అమలు చేయాలి'' అని పెజెష్కియన్ పేర్కొన్నట్లు ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ పేర్కొంది. అణ్వాయుధాన్ని తమ దేశం కోరుకోవడంలేదని కూడా ఆయన చెప్పారు. అణ్వాయుధం తయారు చేయడానికి ఇస్లాం వ్యతిరేకమని ఆయన గతంలో కూడా చెప్పినప్పటికీ ట్రంప్ దానిని తోసిపుచ్చారు. అణ్వాయుధాన్ని తయారు చేసే హక్కు వదులుకునేందుకు ఇరాన్ అంగీకరించిందని, ఇరాన్ దగ్గర ఉన్న శుద్ధిచేసిన యురేనియంను బయటకు తరలించడానికి కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని అనధికార వార్తలు వెలువడిన నేపథ్యంలో పెజెష్కియన్ ప్రకటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ మాట్లాడుతూ, ఇరాన్ డ్రోన్, క్షిపణి కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతుందని చెప్పారు. తమ డ్రోన్, క్షిపణి కార్యక్రమం అభివృద్ధి కోసమేనని, మా నిధులలో కొంత భాగాన్ని దీనికోసం ఖర్చు చేస్తామని, దీనికోసం ఎవరి అనుమతి అడగాల్సిన అవసరం లేదన్నారు. తాము డ్రోన్లు, క్షిపణులు తయారుచేసుకోకపోతే ప్రపంచ పెత్తందార్లు తమపై ఆధిపత్యం చెలాయిస్తారని ఆయన అన్నారు. చర్చలు కీలక తరుణంలో ఉండగా అమెరికా నుండి పరస్పర విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారంలో అమెరికా నాయకులు నిర్ణయ రాహిత్యంతో వ్యవహరిస్తున్నారని, కొన్ని గంటల వ్యవధిలోనే అమెరికా అధికారుల నుండి పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వెలువడటం ఏ చర్చల ప్రక్రియనైనా సంక్లిష్టంగా మారుస్తుందని అన్నారు. ఇరాన్‌తో ఒప్పందంపై చర్చలు పూర్తిగా జరగలేదని ట్రంప్ చెప్పిన తర్వాత విదేశాంగమంత్రి మార్కో రుబియో ఢిల్లీలో మాట్లాడుతూ, ఇరాన్‌తో పూర్తి ఒప్పందం సోమవారం జరిగే అవకాశం ఉందని చెప్పడంపై బఘాయీ పైవిధంగా స్పందించారు.

**ట్రంప్ చెప్పిన యుద్ధానికి కాలం చెల్లింది:పోప్**

ట్రంప్ చెప్పిన యుద్ధానికి కాలం చెల్లిందని పోప్ లియో అన్నారు. మాగ్నిఫికా హ్యూమానిటాస్ అనే ఎన్‌సైక్లికల్స్‌లో ఆయన రాస్తూ, ట్రంప్ చరిబుతున్న న్యాయబద్ధమైన యుద్ధం అనే సిద్ధాంతానికి కాలం చెల్లిందని పేర్కొన్నారు. ఇరాన్‌లో ఇంటర్నెట్ బ్లాకౌట్ 87వ వారంలోకి ప్రవేశించింది. ఇరాన్‌లో తిరుగుబాటు, ప్రజాందోళన మొదలైనప్పటినుండీ ఇంటర్నెట్‌ను తొలగించారు. దేశంలో పౌరులమధ్య అనుసంధానం లేకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. ఇప్పటికి 2,064 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ లేదని నెట్‌బ్లాక్స్ తెలిపింది.

## మధ్యవర్తిత్వ పాత్రపై పాకిస్థాన్‌కు జిన్‌పింగ్ ప్రశంస

**బీజింగ్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సడలిపోవడానికి పాకిస్థాన్ చేసిన మధ్యవర్తిత్వ పాత్రను చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రశంసించారు. సోమవారం బీజింగ్‌లో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రధానమంత్రిపై జిన్‌పింగ్ ప్రశంసలు కురిపించారు. మధ్యవర్తిత్వపాత్ర పోషించడంతోపాటు చొరవ తీసుకున్న పాకిస్థాన్‌ను జిన్‌పింగ్ ప్రశంసించారని షరీఫ్ పేర్కొన్నారు. పాకిస్థాన్ నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వంలో చైనా మొదటినుండీ తమకు మద్దతు ఇస్తోందని, ఈ మేరకు తాము అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితిపై జిన్‌పింగ్ చేసిన నాలుగు ప్రతిపాదనలు శాంతిని సాధించడానికి మార్గనిర్దేశం చేస్తాయన్నారు.



ఇదిలా ఉండగా, బీజింగ్‌లో చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావోనింగ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ, అమెరికా–ఇరాన్ మధ్య ఒక ఒప్పందం కుదిరే అవకాశాలు కనిపిస్తున్నాయని, యుద్ధం ముగింపు దశకు చేరుకునే సూచనలు కనిపిస్తున్నందువల్ల చర్చల ప్రక్రియను ఆపకుండా ముందుకు తీసుకువెళ్ళాలని కోరారు. ''ఇరాన్ విషయంలో చైనా వైఖరి సుస్పష్టం, ఇది ఎప్పటికీ జరగకూడని సంఘర్షణ, ఇక జరగకూడదు, ముందస్తు పరిష్కారం ప్రాంతీయ దేశాలతోపాటు ప్రపంచదేశాలకు కూడా లాభిస్తుంది'' అన్నారు.

## ఆయుధాలు విడిచిపెట్టేందుకు హెజ్బొల్లా తిరస్కృతి

### వచ్చేనెల మళ్ళీ లెబనాన్–ఇజ్రాయెల్ ముఖాముఖీ

**బీరూట్:** ఇజ్రాయెల్–లెబనాన్ దేశాల మధ్య నాల్గో విడత ముఖాముఖీ చర్చలు జూన్ 2, 3 తేదీలలో జరుగుతాయి. ఇప్పటివరకూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాటిస్తున్నట్లు వచ్చినప్పటికీ లెబనాన్‌లో ఇజ్రాయెల్ పూర్తిస్థాయిలో ఉల్లంఘనలకు పాల్పడుతూ హింస, విధ్వంసం సృష్టిస్తోంది. మరోవైపు ఇరాన్ అనుకూల హెజ్బొల్లా సైన్యాధిపతి ఆయుధాలు వదిలిపెట్టేందుకు తిరస్కరిస్తున్నారు. హెజ్బొల్లాను నిరాయుధులుగా చేసేవరకూ తాము లెబనాన్ వదిలివెళ్ళేది లేదని ఇజ్రాయెల్ మంకు పట్టు పడుతున్నది. ఆదేసమయంలో అమెరికా–ఇరాన్ మధ్య దాదాపు ఒక ఒప్పందం కుదిరే పరిస్థితులు కనిపిస్తున్నందువల్ల లెబనాన్‌లో యుద్ధం ముగింపు కూడా ఈ ఒప్పందంలో ఉండాలని ఇరాన్ పట్టుబడుతున్నది. కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం లెబనాన్,ఇరాన్ నుండి తన స్వేచ్ఛను కాపాడుకోవడానికి ఇజ్రాయెల్‌కు పూర్తి దాడి హక్కులు ఉన్నాయని అన్నారు. ఈ పరిస్థితుల మధ్య లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ మాట్లాడుతూ, లెబనాన్ నుండి ఇజ్రాయెల్ వైదొలగడం బేరసారాలకు అతీతమైనదని, దీనిని తమ యంత్రాంగం చర్చల ద్వారానే పరిష్కరించుకుంటుందన్నారు. హెజ్బొల్లా కారణంగా లెబనాన్ ఈ యుద్ధ వలయంలో చిక్కుకుందని అన్నారు. గతంలో రెండు దశాబ్దాలపాటు లెబనాన్‌ను ఇజ్రాయెల్ ఆక్రమించింది. ఆ తర్వాత 2000 సంవత్సరంలో ఆక్రమణ నుండి వైదొలగింది. ఈ పరిణామాలను ఆయన గుర్తుచేసుకుంటూ లెబనాన్ బాధాకరమైన వాస్తవంలో మునిగి ఉందన్నారు.

## రుబియో మాటలతో ఒప్పందంపై ఆశలు
## భారీగా తగ్గిపోయిన చమురు ధరలు

### చమురు మార్కెట్లకు మరో ఏడాది ఒత్తిడి తప్పదు



**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య ఒక ఒప్పందం దర కుదురుతుందని, శుభవార్త అందుతుందని మార్కో రుబియో చెప్పిన ప్రకారం సోమవారమే ప్రకటన వెలువడుతుందని అంచనాలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రపంచ చమురు మార్కెట్‌లో చమురు ధరలు భారీగా ఐదు శాతం మేరకు తగ్గిపోయాయి. గడచిన రెండు వారాలలో ఎన్నడూలేని విధంగా ఈ ధర క్షీణించింది. స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. ఆసియా స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. ఐతే ఎంత ఆశాభావం ఉన్నప్పటికీ, ఒప్పందం కుదిరినప్పటికీ చమురు మార్కెట్లు పుంజుకుని నిల్వల పునరుద్ధరణ జరగాలంటే 2027 వరకు చమురు మార్కెట్లు ఒత్తిడి ఎదుర్కోవాల్సిందేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ చమురు ధరలకు ప్రామాణికంగా భావించే బ్రెంట్ క్రూడాయిల్ ధర సోమవారం నాడు బ్యారెల్‌కు 97.77 డాలర్లకు తగ్గిపోయింది. ఈ ధర మే 22వ తేదీన బ్యారెల్‌కు 103.54 డాలర్లుగా ఉండేది. అంటే దాదాపు ఐదుశాతం మేరకు తగ్గాయి. మే నెల ఏడో తేదీ తర్వాత ఆయిల్ కాంట్రాక్టులు బాగా తగ్గాయి. అమెరికాలో ట్రేడింగ్ క్రూడాయిల్ ధర 5.9 శాతానికి తగ్గి బ్యారెల్ ధర 90.93 డాలర్ల వద్ద నిలిచింది. అదేసమయంలో చైనాలో ఘోరమైన గని ప్రమాదం కారణంగా వంద బొగ్గు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రపంచ దేశాలకు అవసరమైన ముడి చమురు, ద్రవీకృత ఇంధనం ఇరవై శాతం మేరకు హోర్ముజ్ జలసంధి మీదుగానే సరఫరా ప్రయాణం చేసి వస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్ సర్వాధినేత ఆయతొల్లా అలీ ఖమేనీ దాదాపు హత్యకు గురికావడంతో యుద్ధం మొదలైంది. హోర్ముజ్ జలసంధి మూసుకుపోయింది. రాకపోకలు నిలిచిపోయాయి. ఐతే తాము 31 నౌకలను హోర్ముజ్ ద్వారా బయటకు పంపామని ఇరాన్ ప్రకటించింది. పాకిస్థాన్, చైనాలకు చమురు నౌకలు వెళ్ళాయని కూడాప్రకటించింది. వాస్తవానికి హోర్ముజ్ జలసంధిని ఉపయోగించుకోవడానికి ప్రయత్నం చేసిన నౌకలను ఇరాన్ బెదిరించడం ప్రారంభించాక మార్చినెల నుండి ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల్లో హెచ్చుతగ్గులు ఆరంభమయ్యాయి. డి చమురు ధరలు తగ్గినప్పటికీ ఈ ధరలు యుద్ధం ముందునాటికంటే చాలా హెచ్చు స్థాయిలో కొనసాగుతున్నాయి. ఏప్రిల్ నాటికి బ్యారెల్ ధర 100 డాలర్లకంటే చాలా ఎక్కువస్థాయికి పెరిగిపోయింది. రికార్డుదశకు ఈ ధర చేరుకుంది. ఈ ఘర్షణలకు ముందు ఫిబ్రవరిలో చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల వద్ద ట్రేడింగ్ జరిగేది. ఇప్పుడు చమురు భారీగా తగ్గిందని భావించినప్పటికీ యుద్ధం ముందు కంటే ఇంకా ఇరవై డాలర్లు అధికంగానే ఉంది. ''ఈ సంక్షోభం చివరి దశలో కొంత వెలుగు కనిపిస్తోంది, భవిష్యత్తులో కొంత ఉపశమనం కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి'' అని ఎవిఎస్ట్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ సాల్ కవోనిక్ వ్యాఖ్యానించారు. యుద్ధంవల్ల వివిధ చమురు దేశాల్లో మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. వాటిని అనివార్యంగా మరమ్మతులు జరగాలి, మార్కెట్ మళ్ళీ వేగం పుంజుకోవాలి, రిఫైనరీలు, విశ్వసనీయత, సమృద్ధిగా పెరగాలి. వివిధ దేశాలలో ఆర్థిక పరిస్థితులు మెరుగైన చక్కబడటానికి సమయం పడుతుంది. అందువల్ల 2027 వరకూ చమురు మార్కెట్లు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవాల్సిందేనని కవోనిక్ అన్నారు. జలసంధిలో అనేక పేలుడు పదార్ధాలను అమర్చారని, వాటిని తొలగించాల్సి ఉందని, వాటి వల్ల పెద్ద ప్రమాదం పొంచి ఉందని, అందువల్ల హోర్ముజ్ నుండి బయటకు వచ్చిన నౌకలు తిరిగి లోడింగ్ కోసం వెళ్ళేందుకు సంకోచిస్తాయని అన్నారు.

## కాంగోలో 900 ఎబోలా కేసులు

### వైరస్ మృతదేహాలకోసం బంధువుల ఘర్షణ: కాల్పులు

**న్యూయార్క్:**డి.ఆర్.కాంగోలో ఎబోలా విజృంభన శరవేగంగా కొనసాగుతోంది. కొత్తగా మరో 900 కేసులు నమోదైనట్లు ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఎబోలా మృతుల సంఖ్య కూడా 200 దాటింది. దీంతో ఆఫ్రికా దేశాలలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా తూర్పు కాంగో మోంగ్వాలులోని ఎబోలా చికిత్సా కేంద్రం వద్ద మరణించిన తమ కుటుంబీకుల మృతదేహాలు స్వాధీనం చేయాలని బంధువులు ఆగ్రహంతో ఘర్షణలకు పాల్పడ్డారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. ఒక ఐసోలేషన్ టెంట్‌కు బంధువులు నిప్పుపెట్టారు. పోలీసులు చివరకు గాలిలోకి కాల్పులు జరపాల్సివచ్చింది. రోజంతా చికిత్సాకేంద్రంవద్ద ఈ ఘర్షణ కొనసాగింది. తీవ్రమైన వైరస్‌తో ఉన్న మృతదేహాలను స్వాధీనం చేసేందుకు అధికారులు తిరస్కరిస్తున్నారు. వాటిని బంధువులకు ఇస్తే వైరస్ మరింతగా వ్యాపిస్తుందని అధికారుల ఉద్దేశం.ఈ వ్యాధి కరోనా తరహాలో వ్యాపించకపోయినప్పటికీ, అపరిశుభ్రతవల్ల శరవేగంగా వ్యాధి విస్తరిస్తోంది. ఐతే కాంగో ప్రభుత్వానికి మార్గదర్శనం చేస్తున్నామని, ప్రభుత్వం నిఘా పెంచడంవల్ల కొత్త కేసులను గుర్తించగలుగుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనోమ్ ఘెబ్రియేసస్ చెప్పారు. ఈ వ్యాధి మొదటిసారి ఇటూరీ రాష్ట్రంలో ప్రబలిందని, ఈ ప్రాంతం తిరుగుబాటుదారుల అధీనంలో ఉందని, వారు క్వారంటైన్‌ను అమలు చేస్తున్నారని, ఈ ప్రాంతంలో నివసిస్తున్న 50 లక్షలమంది ప్రజల్లోని ప్రతి నలుగురిలో ఒకరికి వైద్య సహాయం,పర్యవేక్షణ అవసరం ఉందని, ప్రతి ఐదుగురిలో ఒకరు నిరాశ్రయులయ్యారని క్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తిరుగుబాటుదారుల హింస వల్ల సామాన్య ప్రజలతోపాటు వైద్య సహాయ బృందాలు కూడా పారిపోయే పరిస్థితి వచ్చిందని ఆందోళన చెందారు. ఈ ప్రాంతానికి సమగ్ర ఆరోగ్య సంరక్షణ ప్యాకేజీని అందించాల్సిన అవసరం ఉందన్నారు.మే 16వ తేదీన డి.ఆర్.కాంగో, ఉగాండాలలో ప్రబలిన బుండిబుగ్యోరకం ఎబోలా వ్యాధి అంతర్జాతీయ అత్యవసర పరిస్థితిని సృష్టించిందని గతంలో ఆయన ప్రకటించారు.1976లో బయటపడిన ఎబోలా వ్యాధి ఆరంభంలో గినియా,సియెర్రా లియోన్, లైబీరియా దేశాలకు కూడా వ్యాపించింది.

**బంగ్లాదేశ్‌లో 528కి పెరిగిన మీజిల్స్ మృతులు**

బంగ్లాదేశ్‌లో గడచిన ఇరవైనాలుగ్గంటలలో మీజిల్స్ వ్యాధి లక్షణాలతో 16 మంది మరణించారు. దీంతో ఈ వ్యాధి లక్షణాలతో మరణించినవారి సంఖ్య 528కి చేరింది. ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ సమాచారం ప్రకారం గడచిన ఒక్కరోజులో ఈ లక్షణాలతో కొత్తగా 1300 కేసులు నమోదయ్యాయి.

## వ్యోమగాములు

(మొదటి పేజీ తరువాయి)

అనే ముగ్గురు వ్యోమగాములు అంతరిక్షకేంద్రంలోకి ప్రవేశించి అప్పటికే అక్కడ ఉన్న తమ ముగ్గురు సహచరులను కలుసుకున్నారు. తర్వాత ఆరుగురూ కలిసి గ్రూప్ ఫోటో దిగారు. కాగా హాంకాంగ్ నుండి మొదటిసారి ఒక వ్యోమగామి అంతరిక్ష కేంద్రానికి వెళ్ళాడు. ఆదివారం రాత్రి గోబీ ఎడారిలో ఉన్న చైనా జియా క్వాన్ శాటిలైట్ సెంటర్ నుండి చైనా లాంగ్ మార్చ్–2 ఎఫ్‌వై 23 వాహకనౌక ఆదివారం రాత్రి షెంఝూ–23 అంతరిక్ష నౌకను విజయవంతంగా మోసుకువెళ్ళి పది నిమిషాల వ్యవధిలోనే నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని, తర్వాతీ నౌక సోమవారం తెల్లవారుజామున చైనా అంతరిక్ష కేంద్రానికి అనుసంధానమైందని సిఎంఎస్‌ఎ ఏజన్సీ ప్రకటించింది. కాగా ఒక వ్యోమగామి ఏడాదికాలంలో చైనా అంతరిక్ష కేంద్రంలోనే ఉండి పరిశోధనలు చేస్తూ రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం అంతరిక్ష కేంద్రానికి వెళ్ళిన వ్యోమగాముల బృందానికి ఝూ యాంగ్ ఝూ నాయకత్వం వహించారు.

## వడగాడ్పులు

(మొదటి పేజీ తరువాయి)

పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 'వేడి రాత్రులు' నమోదయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. రాత్రిపూట కూడా ఉక్కపోత తీవ్రంగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన**

తీవ్రమైన వేడి కారణంగా స్థానిక వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చి, సాయంత్రం లేదా రాత్రి వేళల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. గంటకు 4050 కి.మీ వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం కూడా ఉందన్నారు. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. హైదరాబాద్‌లో సాయంత్రం నుంచి రాత్రివేళల వరకు తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడే అవకాశం ఉందని చెప్పారు.

**వడదెబ్బ లక్షణాలు – వైద్యుల సూచనలు**

శరీరంలో సాధారణ ఉష్ణోగ్రత (98ఓఎఫ్) కంటే వేడి పెరిగినప్పుడు నీరసించి వడదెబ్బకు గురవుతారు. వడదెబ్బల కారణంగా రాష్ట్రంలో మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. వడదెబ్బ లక్షణాల్లో తీవ్రమైన తలనొప్పి, కళ్లు తిరగడం, చెమట రాకపోవడం, వాంతులు, నీరసం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు తెలిపారు. బాధితులను వెంటనే నీడ ప్రాంతానికి తరలించి, చల్లని నీరు లేదా ద్రవ పదార్థాలు ఇవ్వాలని సూచించారు. ప్రజలు రోజుకు కనీసం 6 నుంచి 8 లీటర్ల నీరు తాగాలని, కొబ్బరి నీరు, పండ్ల రసాలు, కర్బూజ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు టోపీ, గుడ్డ లేదా కూలింగ్ గ్లాసెస్ ధరించాలని, పలుచటి తెలుపు రంగు దుస్తులు ఉపయోగించాలని సూచించారు. ఎండలో పనిచేసే కార్మికులు తరచూ నీళ్లు తాగుతూ, మధ్యమధ్యలో పావు గంట నీడలో విశ్రాంతి తీసుకోవాలి. చిన్న పిల్లలను చల్లని ప్రదేశాల్లోనే ఉంచాలి.

## కనీస వేతనం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే రబీకి సంబంధించి రైతు భరోసా ఇవ్వాలని సిఎంకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్న కొనుగోలు చేయడం అభినందనీయమని, రైతులకు వెంటనే మొక్క జొన్న డబ్బులు చెల్లించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకతీతంగా పేదలకు అందేందుకు గ్రామసభలలో అర్హులను గుర్తించి, ఆ గ్రామానికి కేటాయించిన ఇండ్లకు లబ్ధిదారులను లాటరీ ద్వారా గుర్తించాలని సిపిఐ ప్రతినిధుల బృందం సిఎంను కోరింది. భూదాన్ భూములలో, ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలివ్వాలని, గ్రేటర్ హైదరాబాద్‌లో 20 వేల మంది గుడిసెలు వేసుకున్న పేదలకు కోర్టు కేసులు పరిష్కరించి ఇండ్ల ప ట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కొనసాగించి, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని సిఎంవారు కోరారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**కేంద్రం సహకరించక పోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం: సిఎం**

కేంద్రం సహకరించక పోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి సిపిఐ ప్రతినిధి బృందానికి వివరించారు. మొక్క జొన్న దిగుబడి బాగా వచ్చిందని, కేంద్రం మొక్కజొన్న కొనుగోలు చేయడంలేదన్నారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్క జొన్న కొనుగోలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## సమన్వయంతో ముందుకు

(మొదటి పేజీ తరువాయి)

మధ్య కృష్ణా జలాల వినియోగం, తాగు, సాగునీటి అవసరాలపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కర్ణాటక రాష్ట్ర చిన్న తరహా నీటి వనరుల శాఖ మంత్రి బోసురాజు భేటి అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, రాయచూర్ ఎంపి జి.కుమార్ నాయక్, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవితో పాటు రాయచూర్ రూరల్ ఎంఎల్‌ఎలు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లా ఎంఎల్‌ఎలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, శివకుమార్ రెడ్డి, వంశీకృష్ణ, రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఇఎన్‌సి రమేష్ బాబు, కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖ కార్యదర్శి బి.కె.పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలు వినియోగించుకునే విషయంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిపారు. తెలంగాణ సాగునీటి, తాగునీటి హక్కుల పరిరక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధివిధానాలపై ప్రాథమికంగా చర్చించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో అనుసరించనున్న విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. అంతర్‌రాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు మంత్రి చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణ రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## నేర్చుకోవడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించాలని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ఇది బాధాకరం. గత ఘటనల నుంచి వారు ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదు. ఈ అంశం ఇప్పటికే కోర్టు ముందుకు వచ్చింది. అప్పట్లో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ పలు సూచనలు చేసింది. ఇప్పుడు ఆ సూచనల అమలుపై స్పష్టత కావాలి' అని కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా), యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యుడిఎఫ్) సహా పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. నీట్ పరీక్ష నిర్వహణలో వరుసగా జరుగుతున్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని పిటిషనర్లు వాదించారు. ఈ నేపథ్యంలో ఎన్‌టిఎను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలని లేదా దాని స్థానంలో స్వతంత్ర, పారదర్శక సంస్థను ఏర్పాటు చేయాలని కోర్టును కోరారు. ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్‌యుజి పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ పరీక్షను ఎన్‌టిఎ నిర్వహించింది. అయితే లీక్ ఆరోపణలు తీవ్రరూపం దాల్చడంతో మే 12న పరీక్షను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులు కోర్టులో కీలక వాదనలు వినిపించారు. ఇప్పటికే 22 లక్షలకుపైగా విద్యార్థులు ఈ వ్యవస్థపై నమ్మకం కోల్పోయారని పేర్కొన్నారు. వరుసగా జరుగుతున్న లీక్ ఘటనలు విద్యార్థుల ప్రాథమిక హక్కులపై నేరుగా దాడి చేసినట్లేనని వాదించారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. ఇంకా, మళ్లీ నిర్వహించే పరీక్షలను ఒక హైపవర్ కమిటీ పర్యవేక్షణలో నిర్వహించాలని పిటిషనర్లు కోరారు. ఆ కమిటీలో మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తిని ఛైర్మన్‌గా నియమించాలని, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలను సభ్యులుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు జరగకుండా అడ్డుకోవచ్చని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి మాజీ ఇస్రో చైర్మన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వం వహించిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది. ఆ కమిటీ సూచనల అమలుపై కూడా వివరాలు ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలు పరిస్థితిని తెలియజేస్తూ మానిటరింగ్ కమిటీ చైర్మన్‌గా కె. రాధాకృష్ణన్ నివేదిక సమర్పించాలి అని పేర్కొంది. నీట్ పరీక్ష నిర్వహణలో పారదర్శకత, భద్రత అంశాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్య ప్రవేశాల కోసం ఈ పరీక్ష రాస్తుంటారు. ఇలాంటి కీలక పరీక్షల్లో వరుసగా లీక్ ఆరోపణలు రావడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన పెంచుతోంది.

## పెట్రో మోత

(మొదటి పేజీ తరువాయి)

పడిపోయింది. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు, కీలకమైన ప్రపంచ చమురు రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధి గుండా నౌకాయానానికి అంతరాయం కలగడంతో, ఫిబ్రవరి చివరి నుండి ప్రపంచ ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, దేశీయ వంటగ్యాస్ ఎల్‌పిజి ధరలను 14.2 కేజీల సిలిండర్‌కు రూ. 60, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి) ధరలను కిలోకు రూ. 4 చొప్పున మే మధ్య నుండి పెంచారు. ఈ వరుస పెంపులు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను మరింత పెంచి, ఆర్థిక వ్యవస్థ వ్యాప్తంగా రవాణా, లాజిస్టిక్స్ ఖర్చులను పెంచుతాయని అంచనా. భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం మార్చిలో 3.40 శాతం నుంచి ఏప్రిల్‌లో 3.48 శాతానికి పెరగగా, ప్రధానంగా పెరిగిన ఇంధన, శక్తి ఖర్చుల కారణంగా టోకు ద్రవ్యోల్బణం 42 నెలల గరిష్ఠ స్థాయి అయిన 8.3 శాతానికి చేరింది.

## కొత్త కోర్సుల 'పంచాయితీ'

(మొదటి పేజీ తరువాయి)

కూడా విశ్వవిద్యాలయాలే అని కళాశాల కమిషనరేట్ స్పష్టం చేసింది. మరోవైపు డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులకు విశ్వవిద్యాలయాల నుంచి అనుమతులు పొందామని, కోర్సులు కూడా సిద్ధమేనని ఉన్నత విద్యామండలి చెబుతుంది. కొత్త కోర్సుల నేపథ్యంలో సిలబస్ తదితర అంశాలపైన కళాశాల కమిషనరేట్ రెండు సార్లు సమావేశాలను నిర్వహించినప్పటికీ ఈ సమావేశానికి ఉన్నత విద్యామండలి చైర్మన్ హాజరుకాలేదని,కనీసం ఉన్నత విద్యామండలి నుంచి ఏ ఒక్కప్రతినిధి కూడా హాజరుకాలేదని కళాశాల కమిషరేట్ వర్గాలు చెబుతున్నాయి. కళాశాల కమిషనరేట్, ఉన్నత విద్యా మండలి మధ్య ఆదిపత్య పోరు కొనసాగడం విద్యా వ్యవస్థకు మంచిది కాదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కొత్త కోర్సులు, సిలబస్ అంశాలు విశ్వవిద్యాలయానికి సంబంధించిన అంశాలలో అధికార యంత్రాంగం జోక్యాన్ని విద్యా మండలి జీర్ణించుకోలేకపోతున్నది.

**'దోస్త్' రెండో విడతలో కొత్త కోర్సులా...?**

డిగ్రీలో ప్రవేశల నిమ్మితం చేపట్టే 'దోస్త్' రెండవ విడతలోనైనా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలనే యోచనలో ఉన్నత విద్యా మండలి ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. సిలబస్‌కు సంబంధించిన ప్రక్రియను కూడా పూర్తి చేసినట్టు తెలిసింది. కళాశాలల కోర్సులకు అనుమతుల విషయం పక్కన పెడితే 'దోస్త్' రెండవ విడత ప్రవేశాలలో హడావుడిగా కోర్సులను ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఏముందనే వాదన కూడా వినిపిస్తోంది.

**ఆ కళాశాలలకు 'బిబిఎ,బిబిఎం'కు అనుమతులు ఉన్నట్టేనా..?**

రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు కళాశాలలో బిబిఎ, బిబిఎం కోర్సుల విషయంలో అనుమతుల పునరుద్ధరణపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కోర్సుల విషయంలో అనుమతుల పునరుద్ధరణ విషయాన్ని పట్టించుకోకుండానే కళాశాల కమిషనరేట్ దోస్త్‌లో చేర్చినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే అనుమతులు పునరుద్ధరణ అనే అంశం తమకు సంబంధం లేదని, ఇది వరకు తమ జాబితాలో ఉన్న కళాశాలలు, కోర్సులకు సంబంధించి సీట్లను దృష్టిలో పెట్టుకుని తాము 'దోస్త్'లో పొందుపర్చినట్టు కళాశాల కమిషనరేట్ అధికార వర్గాలు పేర్కొన్నాయి. అయితే యుజిసి నిబంధనలు ప్రకారం ప్రభుత్వ కళాశాలలో కొత్త కోర్సుల విషయంలో విద్యార్థుల అడ్మిషన్ నుంచి ఆ కోర్సులను పూర్తి చేసే లోపు ఎప్పుడైనా అనుమతి పొందవచ్చునని కళాశాల కమిషనరేట్ స్పష్టం చేసింది. న్యాక్ అనుమతి పొందిన కళాశాలలో మాత్రమే కొత్త కోర్సులకు అనుమతి ఉంటుందని తెలిపింది. ప్రైవేటు కళాశాలలు మాత్రం ముందుగానే అనుమతులు పొందాల్సి ఉంటుంది.

## 'సంతకాలు సాధ్యంకాదు'

(మొదటి పేజీ తరువాయి)

ఒక బలమైన ఒప్పందం కోసం ఖతార్ ప్రధానమంత్రితో చర్చలు జరుపుతారు. హోర్ముజ్ జలసంధిని తెరవడం, శుద్ధిచేసిన యురేనియం భవితవ్యం వంటి విషయాలపై చర్చిస్తారని భావిస్తున్నారు. కానీ అవగాహన ఒప్పందం (ఎంఓయు)లోని కొన్ని క్లాజులను అమెరికా వ్యతిరేకిస్తోందని, యుద్ధం ముగించేందుకు ఇరాన్ కృషిలో పురోగతి ఉన్నప్పటికీ ఈ ఎం.ఓ.యును ఇప్పటికీ ఇంకా రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని తస్నీం న్యూస్ ఏజన్సీ ప్రకటించింది. లెబనాన్‌లో యుద్ధం ముగించే అంశం కూడా ఈ ఒప్పందంలో జోడించాలని ఇరాన్ కోరుతోంది. కానీ ట్రంప్ మాత్రం, ఒప్పందం కుదిరినప్పటికీ, ఇజ్రాయెల్ తన స్వేచ్ఛను కాపాడుకోవడానికి ఇరాన్–లెబనాన్‌పై ప్రతిఘటనకు అవకాశం ఉందని అన్నారు. ప్రతిపాదిత ఒప్పందం ఒక తుది పరిష్కారం కాదని అమెరికా మీడియా అభివర్ణించింది.

మధ్యవర్తిదేశం పాకిస్థాన్ పత్రిక సోమవారంసాయంత్రం చెప్పిన సమాచారం ప్రకారం, ''యుద్ధాన్ని ముగించేందుకు జరిగిన చర్చల్లో అమెరికా–ఇరాన్ అనేక అంశాలపై అవగాహనకు వచ్చాయి,మేం చాలా అంశాలలో ఒక ముగింపు దశకు వచ్చామని చెప్పడం సరైనదే, ఐతే తక్షణం ఒప్పందంపై సంతకాలు సాధ్యంకాదు''అని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయెల్ బఘాయీ హెచ్చరించారు. ''అమెరికా పరస్పర విరుద్ధంగా మాట్లాడుతోంది, వైఖరులు మారుస్తోంది, అందువల్ల ఒక అవగాహనకు వచ్చినాగానీ తక్షణం ఒప్పందం కుదురుతుందని సంతకాలు జరుగుతాయని ఎవరూ వాదించలేరు'' అన్నారు. ప్రజల దృష్టిని తప్పుతోవ పట్టించేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. ఇరు దేశాలు ఒక ముసాయిదాపై ఒప్పందానికి వచ్చిన తర్వాతే అణు కార్యక్రమాన్ని చర్చల్లో ఒక భాగంగా చేరుస్తామని ఆయన చెప్పారు. ఏప్రిల్ 13 నుండి ఇరాన్ ఓడరేవులపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, హోర్ముజ్ జలసంధి నిర్వహణకు సంబంధించిన అంశాలన్నీ ఈ ముసాయిదాలో చేర్చాం, నౌకా దిగ్బంధనం పేరుతో అమెరికా తీసుకుంటున్న చర్యలు ఆపాలి, హోర్ముజ్‌లో రాకపోకల సురక్షిత భద్రత గురించి ఇరాన్ చర్యలు తీసుకుంటుంది అని బఘాయీ చెప్పారు. జలసంధిలోంచి ప్రయాణించే నౌకలపై ఇరాన్ సుంకాలు విధించడంలేదని, నౌకాయాన సేవలకుగాను రుసుములు మాత్రమే వసూలు చేస్తోందని చెప్పారు. ''ఇరాన్ సుంకాలు వసూలు చేయడంలేదు, హోర్ముజ్ జలసంధిం, పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రాలలో పర్యావరణ పరిరక్షణ సేవలు, నౌకలకు చేసే సేవలకు రుసుములు వసూలు చేయడం అవసరం, టోల్స్ వసూలు చేసే ప్రయత్నం చేయడంలేదు'' అని చెప్పారు. జలసంధి తమ నియంత్రణలోనే ఉంటుందని ఇరాన్ మొదటినుండీ చెబుతోంది.ఈ అవగాహన ఒప్పందంలో 60 రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు,హోర్ముజ్‌ను తిరిగి తెరవడం,అణు కార్యక్రమం వంటివి ఉన్నాయని చెబుతున్నారు. తుది ఒప్పందం కుదరడానికి 30 నుండి 60 రోజులు గడువు విధించారని నిన్నటినుండీ వార్త వెలువడుతోంది.

యుద్ధాన్ని ముగించేందుకు 14 అంశాల చట్రాన్ని (ఫ్రేమ్‌వర్క్)ను ఖరారు చేస్తున్నట్లు ఇరాన్ చెప్పిన తర్వాత ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఒప్పందం చేసుకోవడానికి కంగారు పడవద్దు అని సంధాన కర్తలకు ట్రంప్ ఒకవైపు చెబితే, భారత్ పర్యటనలో ఉన్న మార్కో రుబియో మాత్రం ఇరాన్‌తో సోమవారం ఒక పూర్తిస్థాయి ఒప్పందం కుదురుతుందని ఢిల్లీలో పాత్రికేయులతో అన్నారు.

**మొజ్తాబా వల్ల కొంత జాప్యం?**

తీవ్రంగా గాయపడి భూగృహంలో చికిత్స పొందుతున్న మొజ్తాబా ఖమేనీకి చర్చల సమాచారం చేరవేయడంలో జాప్యం జరుగుతోందని, ఆయన ఆమోదం జాప్యం జరుగుతోందని వార్తలు వెలువడ్డాయి.ఈ విషయాన్ని అమెరికా కూడా అంగీకరించింది. మొజ్తాబా నుండి తుది సమాధారం రాలేదు. దానికోసం కూడా ఇరాన్ నాయకులు ఎదురుచూస్తున్నారు. ఈ ఎంఓయును మొజ్తాబా ఖమేనీ చూశారని తమకు సమాచారం అందిందని, దూతల ద్వారా ఆయనకు సమాచారాన్ని చేరవేస్తున్నారని అమెరికా గూఢచారి వర్గాలు పేర్కొన్నాయి.

**రిపబ్లికన్‌పార్టీలో విభేదాలు**

ఒప్పందం కుదురుతుందని వార్తలు వస్తున్న తరుణంలో రిపబ్లికన్‌పార్టీలో ఎంపీలు,నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. వారిలో విభేదాలు మొదలయ్యాయి. కొందరు ఇరాన్ పట్లబాహాటంగానే ఉదారంగా ప్రకటనలు చేస్తుండగా, మరికొందరు ఈ ఒప్పందం వినాశకరమైనదని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. సెనేటర్ టెడ్ క్రూజ్ ఈ ఒప్పందాన్ని వినాశకరమైనదిగా విమర్శించారు. సెనేట్ సాయుధ సేవల కమిటీ అధ్యక్షుడు రోజర్ వికర్ మాట్లాడుతూ, 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించడమంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ద్వారా సాధించిన దంతా వృథా చేసినట్లేనన్నారు. ఈ విమర్శలకు ట్రంప్ సమాధానం చెబుతూ ఇది తుది ఒప్పందం కాదని అన్నారు. తాము ఈ ఒప్పందాన్ని ఇంకా ఖరారు చేయలేదన్నారు. ఒబామా చర్చలు జరిపిన జెసిపిఓఎ ఒప్పందానికి ఖచ్చితంగా ఇది వ్యతిరేకం, ఇరాన్ చేతికి అణ్వాయుధం ఇచ్చే ఒప్పందం నేను చేసుకోను'' అని ట్రంప్ సోషల్ మీడియాలో రాశారు.

## నీరు చోరీచేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** మోటర్ల ద్వారా నీటిని చోరీచేస్తే కఠిన చర్యలు తప్పవని వాటర్ వర్క్స్ మేనేజర్ సాయికిరణ్‌గౌడ్ అన్నారు. నాగారం ఓల్డ్ విలేజ్‌లో వాటర్‌లో ప్రెషర్ సమస్యపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ప్రజా పాలన పట్టణ ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నాగా రం డివిజన్ పరిధి లోని ఓల్డ్ విలేజ్‌లో, కాలనీలో తక్కువ నీటి ఒత్తిడి సమస్య ఫిర్యాదులు అందిన నేపథ్యంలో నాగారం వార్డు వాటర్ వర్క్స్ మేనేజర్ సాయికిరణ్ గౌడ్ సరఫరా సమయాల్లో లైన్‌మెన్‌లతో కలసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మోటర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక తనిఖీల్లో కొంత వినియోగదారులు మోటర్ల ద్వారా నేరుగా నీటిని చోరీ చేస్తున్నారని దీంతో ఇతర వినియోగదారులకు తక్కువ ప్రెజర్‌తో నీటి సరఫరా అవుతున్నట్లు ఆయన తెలిపారు.

## ఆసరా పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి : సిపిఐ నేత కృష్ణ




**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** మూసాపేట్ సర్కిల్ పరిధిలో నివసిస్తున్న వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు ఆసరా పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మూసాపేట్ జిహెచ్‌ఎంసి సర్కిల్ కమిషనర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అనేకమంది అర్హులైన లబ్ధిదారులు సంవత్సరాలుగా దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటికీ పింఛన్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, వితంతువులు ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు స్వయం ఉపాధివైపు అడుగులు వేయాలి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వికారాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆర్కాతల గ్రామంలో టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు ఘనంగా ప్రారంభించారు. గ్రామ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంజాయి రేణుక రాములు మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, ప్రభుత్వం అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టైలరింగ్ వంటి నైపుణ్యాలను అభ్యసించడం ద్వారా ఆర్థికంగా ఎదగడానికి మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఎస్బిఐ ఆర్‌ఎస్‌ఈటిఐ చిల్కూర్ వారి సహకారంతో నిర్వహించబడుతుండగా, పలువురు గ్రామ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామీణ మహిళల సాధికారతకు ఇలాంటి శిక్షణలు ఎంతో దోహదపడతాయని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శివలీల భాగయ్య, ఏఎంసి చైర్మెన్ రాథోడ్ గీతసింగ్, పిఏసిఎస్ మాజీ చైర్మెన్ పోలీస్ రాంరెడ్డి, ఏఎంసి డైరెక్టర్ లు ఖదీర్, వెంకటేష్ గౌడ్, ఎంపీఓ విజయ్ కుమార్, ఏపిఎం దేవయ్య, పంచాయతీ కార్యదర్శి ఉమా, గ్రామ వార్డు సభ్యులు, మహిళా సంఘం అధ్యక్షులు, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పోషక విలువలతో కూడిన ఆహారం అవసరం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పోషక విలువలతో కూడిన ఆహారం, క్రమం తప్పకుండా ఆరోగ్య చెకప్‌లపై అవగాహన అవసరం అని మూడు చింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్లు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎల్లంపేట మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతపై అంగన్వాడి కేంద్రంలో కిషోర్ బాల బాలికలకు వివరించారు. తల్లిదండ్రులు, పిల్లలకు సమతుల ఆహారం ప్రాముఖ్యత, ఆరోగ్యకర జీవన శైలి, పోషకాహారంపై సమగ్రంగా తెలియచేసారు. ఈ సందర్భంగా మహిళలకు కుకింగ్ కాంపిటేషన్ నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, బాలబాలికలకు ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం, ఇతర పౌష్టికాహార పదర్థాల ప్రాముఖ్యతను వివరించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైద్యాధికారులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## లారీని ఢీకొట్టిన డిసిఎం..డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** లారీని డిసిఎం ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ నుంచి బీరంగూడ వైపు ఇంటి సామానులతో వెళ్తున్న డిసిఎం వ్యాన్ శామీర్‌పేట టోల్‌ప్లాజాను దాటుతున్న క్రమంలో ఆగి ఉన్న లారీని డిసిఎం వ్యాన్ (ఎపి28వి5114) లారీ నెంబర్ (టిఎస్07యుబి5557)ను వెనకాల నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డిసిఎం వాహనం ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ రవి ఇరుక్కుపోయి మృతి చెందాడు. ముందు భాగంలో కూర్చున్న మరో ఇద్దరు కూలీలకు గాయాలు కాగా మరో ముగ్గురు కూలీలు వెనకాల ఉన్నారు. గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు.

### ప్రాజెక్టు పనుల్లో

# ‘డిపిఆర్’ గుండెకాయ వంటిది

### ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వందల, వేల కోట్ల రూపాయలతో చేపట్టే ఏ పెద్ద ప్రాజెక్టుకైనా ‘డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్’ (డిపిఆర్) అనేది గుండెకాయ వంటిదని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఇస్కీ) డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు స్పష్టం చేశారు. టెక్నికల్ సైట్ ఇన్వెస్టిగేషన్, భవిష్యత్తు అవసరాలు, టోపోగ్రాఫికల్ సర్వే, జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్, హైడ్రోలాజికల్ స్టడీస్, ఇంజనీరింగ్ డిజైన్స్, డ్రాయింగ్స్, అంచనా వ్యయం వంటి అన్ని అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతే డిపిఆర్ సిద్ధం అవుతుందన్నారు. భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సిఎజి)ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సీనియర్ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్, డివిజనల్ అకౌంటెంట్ సిబ్బంది కోసం ‘ప్రిపరేషన్ ఆఫ్ ఎస్టిమేట్స్ అండ్ డిపిఆర్ ఫర్ ఇంజనీరింగ్ అండ్ వర్క్స్’ అనే అంశంపై ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం సోమవారం ఎస్కీలో ప్రారంభమైంది.

ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టులు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేస్, భారీ సాగునీటి ప్రాజెక్టులు, సొరంగ మార్గాలు, ఎయిర్ వేస్, షిప్ యార్డ్స్ వంటి భారీ నిర్మాణాలను ఆర్కిటెక్చరల్ డ్రాయింగ్స్ నుండి వివిధ డైమెన్షన్స్‌లో స్టడీ చేసిన తర్వాతే చేపడతారని తెలిపా రు. ఇలాంటి పనులపై కాగ్ (సిఎజి)లో పనిచేసే డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్‌కు పూర్తి అవగాహన ఉండటం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. గత ఏప్రిల్ 16న న్యూఢిల్లీలో కాగ్, ఎస్కీల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా రాబోయే రెండు మూడు నెలల్లో కాగ్ అకౌంట్స్ అధికారులందరికీ నిపుణులైన సీనియర్ ఇంజనీర్లతో డిపిఆర్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంతటి గురుతర బాధ్యతను ఎస్కీకి అప్పగించినందుకు కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ బీజయ్ కుమార్ మొహంతీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**నిపుణులతో శిక్షణా తరగతులు**

రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ డాక్టర్ భిక్షపతి ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్స్, అస్సెస్‌మెంట్స్ అంశాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ సివిల్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ సూర్య ప్రకాష్ ఎస్టిమేట్స్ తయారీలో మెన్, మెషినరీ, మెటీరియల్స్, ఓవర్ హెడ్స్ యొక్క ప్రాధాన్యతను వివరించారు. వచ్చే ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో స్టాండర్డ్ షెడ్యూల్ట్ రేట్స్, ఐటీ టూల్స్ ఫర్ ఎస్టిమేషన్స్, క్వాలిటీ కంట్రోల్ మెకానిజం, వాటర్ సప్లై శానిటేషన్ డిపిఆర్ లపై సీనియర్ రిటైర్డ్ ఇంజనీర్లు ఇ.కృష్ణ మూర్తి, డాక్టర్ ఎస్. నాగ భూషణ రావు, జి.కొండల రావు, వి. నారాయణ, డాక్టర్ కల్యాణ రామ ఫ్యాకల్టీలుగా వ్యవహరించనున్నారు.

**దేశవ్యాప్తంగా తరలివచ్చిన అధికారులు**

ఈ ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమంలో పాల్గొనడానికి పాట్నా, ఇంఫాల్, చండీగఢ్, రాంచీ, ప్రయాగ్‌రాజ్, అగర్తలా, చెన్నై, కలకత్తా, సిమ్లా, పూరి, భోపాల్, ఇటానగర్, అహమ్మదాబాద్, జైపూర్‌ల నుండి కాగ్ అధికారులు హైదరాబాద్‌కు తరలివచ్చారు. ఎస్కీ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ విభాగం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్లుగా ఫ్యాకల్టీ జి. నరేష్, ప్రోగ్రాం అధికారి ఎస్.ఏ కవిత వ్యవహరిస్తున్నారు.

## ప్రజావాణిలో 184 అర్జీలు

### వికలాంగులు, మహిళలు, వృద్ధులు సైతం ఎండను లెక్క చేయకుండా బారులు తీరిన అర్జీదారులు





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహించిన ప్రజావాణిలో ఏకంగా 184 అర్జీలు దాఖలు చేసారు. నెత్తిన తారెత్తిస్తున్న ఎండలను సైతం లెక్కచేయకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దరఖాస్తుదారులు కిందిస్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్‌కిస్తే అయినా మోక్షం లభిస్తుందేమోనన్న ఆశతో కదలివచ్చి తమవంతు కోసం ప్రజావాణిలో బారులు తీరారు. వీరిలో మహిళలు, వృద్ధులు, వికలాంగులు సైతం ఉండటం పలువురిని కదిలించింది. ఇకనైనా వీరి అర్జీలకు మోక్షం లభిస్తుందని ఆశిద్దాం. వీరిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అదన పు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఆర్డీఓ చంద్రావతి, ఇతర జిల్లాస్థాయి ప్రభు త్వ కార్యాలయాధికారులతో కల్సి ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. డబుల్ బెడ్ రూంలు, స్థానిక మున్సిపల్ సంబంధిత సమస్యలతో పాటు పలు ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజావాణిలో విన్నవించుకొన్నారు. వీటిని స్వీకరించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీల కు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని అధికారులకు సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలను సైతం దరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

## బాచుపల్లి బాక్స్ క్రికెట్ లీగ్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు 8 జట్లు



**ప్రజాపక్షం /కుత్బుల్లాపూర్ :** బాచుపల్లి క్రాంతినగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్, తక్ష డెంటల్, ఎన్ఎస్ అకాడమీ సౌజన్యంతో నిర్వహిస్తున్న బాచుపల్లి బాక్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 32 జట్లు పాల్గొనగా, వాటిని నాలుగు గ్రూపులుగా విభజించి శని, ఆదివారాల్లో మ్యాచ్‌లు నిర్వహించారు. ప్రతి జట్టు రెండు మ్యాచ్‌లు ఆడగా మొత్తం 32 మ్యాచ్‌లు విజయవంతంగా పూర్తయ్యాయి. మ్యాచ్‌లలో ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మొమెంటోలు, బహుమతులు అందజేశారు. అలాగే నిర్ణయించిన పాయింట్లలో సిక్సర్లు, ఫోర్లు కొట్టిన ఆటగాళ్లను ప్రత్యేక బహుమతులతో ప్రోత్సహించారు. లీగ్ దశ ముగిసే సరికి 8 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. వచ్చే శని, ఆదివారాల్లో క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హరితవనం కాలనీ యూత్ క్లబ్ సభ్యులు పవన్, సతీస్, అజయ్, మురళి, మణికంఠ, హర్షిత్, పునీత్ నిర్వహణలో, శ్రీకర్, కిషోర్ అందించిన కామెంట్రీ మ్యాచ్‌లకు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది.

## అధికారుల హాజరు తప్పనిసరి : కలెక్టర్ దీపక్‌తివారి



**ప్రజాపక్షం/వికారాబాద్ :** .జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అధికారులను అదేశించారు. ప్రజావాణికి వివిధ ప్రాంతలనుండి వచ్చి న ప్రజల నుండి 189 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. ఈ ఇందులో ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, ఆసరీ పెన్షన్లు, రేషన్‌కార్డులు, గృహనిర్మాణము ,వ్యవసాయ,ఉపాధి తదితర వాటిపై దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు.

**గైర్హాజరు అయిన అధికారులకు షోకాజ్ నోటీసులు**

విధులకు హాజరు కాకపోవడం పై డిసిహెచ్‌ఎస్ సూపరిటెండెంట్ డాక్టర్ అనంద్ , ఎంసిహెచ్‌సూపరిటెండెంట్ డాక్టర్ వినయ్ , 108 కోఆర్డినేటర్ రాఘురామ్‌లకు షోకాజ్ నోటీసలు జారీ చేసి వివరణ కోరడం అయింది. ముందస్తు అనుమతుల లేకుండా విధులకు హాజరుకని అధికారులు వివరణ సమర్పించాలని అన్నారు. లిఖిత పూర్వకంగా సమదనం ఇవ్వకపోతే సస్పెన్షన్ తో సహ క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విచరణలో జాప్యం చేసినట్లయితే తదుపరి నోటీసు లేకుండా, అమలులో ఉన్న నియమ, నిబంధనల ప్రకా రం క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అంతే కాక ,అదే విషయం మళ్ళీ పునరావృత్తంమైతే పని చేయడానికి ఆసక్తి లేదని భావించి ,ఆ విషయాన్ని ప్రభుత్వనికి నివేదించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీస్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్,వెంకటచారి ,జెడ్పి సిఇఓ సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు సుందరీకరణకు శ్రీకారం

**ప్రజాపక్షం/ఉప్పల్:** ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు వేగం గా ముందుకు సాగుతున్నా యి. రూ.37.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా సోమవారం చెరువు అలు గు తొలగింపు పనులను ప్రారంభించారు. ఈ పనులను ఉప్ప ల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకు లు, కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. అలుగు తొలగింపుతో చెరువులోని నీరు బయటికి వెళ్లి, త్వరలోనే చెరువు పూర్తిగా ఖాళీ అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం సుందరీకరణ పనులు ప్రారం భం కానున్నాయని పేర్కొన్నారు. చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం కావడం పట్ల నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల ప్రతినిధులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా చెరువులను అభివృద్ధి చేయడం లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే విధంగా, త్వరలోనే పటేల్‌కుంట చెరువు సుందరీకరణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మె ల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, హెచ్‌ఎంటి నగర్, బాపూజీనగర్, సరస్వతీ నగర్, తదితర ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** బూత్ లెవెల్ నుండి కార్యకర్తలందరూ సమిష్టిగా, ప్రణాళికాయుక్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే మ పథకాలను ప్రజల ముందుకు తీసుకొని వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కా.జిగిరి జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పిలుపిచ్చారు. సోమవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి డిసిసి అధ్యక్షుడితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మల్కాజిగిరి పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జి సమీర్ కౌశల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ పాలన కంటే రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో వివిధ రకాల ప్రజాభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్న విషయాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు పార్టీ ఇచ్చిన హామీల మేరకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేందర్, చంద్రశేఖర్, నిమ్మ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం:** పెంచిన పెట్రోల్ ధరలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆనంద్‌బాగ్ చౌరాస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నర్సింగరావు, లక్ష్మి కాంతరెడ్డి, బికె శ్రీనివాస్, సతీష్‌కుమార్, పిట్టల శ్రీనివాస్, వెంకన్న, వినోద్‌కుమార్, జీవన్‌రెడ్డి, సంపత్‌గౌడ్, వినోద్‌కుమార్, ప్రవీణ్, సత్యమూర్తి, యూసూఫ్‌బాయ్, రాందాస్, సంతోష్, సాయి కుమార్, సయ్యద్ మబ్బు, ఫరీద్‌బాయి, ప్రభ, ఆశ, ఇందిర ప్రియదర్శిని, శారద, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.



## పెన్షన్‌దారులకు ఫేస్ రికగ్నిషన్

* కమ్యూనిటీ హాళ్లలో సిబ్బంది అందుబాటు
* జూన్ 1 నుండి 15 వరకు, ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి మున్సిపల్ సర్కిల్ పరిధిలోని పెన్షన్‌దారులకు జూన్ 1 నుండి 15 వరకు జీవన నిర్ధారణలో భాగంగా ఫేస్ రికగ్నేషన్ (ముఖ గుర్తింపు) కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిప్యూటి కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా పెన్షన్‌దారుల ఫేస్ రికగ్నేషన్ సర్కిల్ ప్రాంతంలోని అన్ని కమ్యూనిటీ హాళ్లల్లో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సిబ్బంది అందుబాటులో ఉండి సేకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పెన్షన్‌దారులందరూ వినియోగించుకోవాలని కోరారు.

**ఎంఎంసి మల్కాజిగిరి, మౌలాలి సర్కిళ్ల పరిధుల్లో 15,414 మంది పెన్షన్‌దారులు**

మల్కాజిగిరి, మౌలాలి సర్కిల్ పరిధిల్లో 15,414 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. 5962 మంది వృద్ధులు, 2163 మంది వికలాంగులు, 6229 మంది వితంతువులు, 1030 మంది ఒంటరి మహిళలు, నలుగురు కల్లు కార్మికులు, 20 మంది బీడి కార్మికులు, ఆరుగురు నేత కార్మికులు పెన్షన్‌దారుల జాబితాలో ఉన్నారని అధికారులు పేర్కొన్నారు.

## బ్యాంకు అధికారిణి సృజనకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఉప్పల్ :** డెన్‌హిల్జ్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపున స్టేట్ బ్యాంకు అప్ ఇండియా మల్లాపూర్ బ్రాంచ్ అధికారిణి సృజన వైట్లను ప్రత్యేకంగా సన్మానించారు. ఇటీవల సంస్థ నిర్వహించిన ఒక ఆన్‌లైన్ లావాదేవీలో పొరపాటున నిధులు అనుకోని మూడవ పక్ష ఖాతాకు జమ కావడంతో సంస్థ ఆందోళనకు గురైంది. ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే సృజన వైట్ల చాకచక్యంగా స్పందించి, తప్పుగా జమ అయిన నిధులను స్తంభింపజేయడంతో పాటు సంబంధిత ఖాతాదారుతో తక్షణమే సంప్రదింపులు జరిపారు. అలాగే ఇతర బ్రాంచ్ మేనేజర్‌లతో సమన్వయం చేసుకుని సంస్థకు చెందిన మొత్తాన్ని సురక్షితంగా తిరిగి పొందడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె చూపిన వృత్తి నైపుణ్యం, నిజాయితీ, వేగవంతమైన సేవలను అభినందిస్తూ డెన్‌హిల్జ్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దేవి కుమార్ మోటూరి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, బ్యాంకింగ్ సేవల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించిన సృజన వైట్ల సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో మహిళా ఉద్యోగినుల భద్రత లక్ష్యం

### అంతర్గత ఫిర్యాదు కమిటీ తప్పని సరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మహిళలు పనిచేసే ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో పోష్ యాక్ట్ 2013 (లైంగిక వేధింపుల నివారణ చట్టం) మేరకు విధిగా అంతర్గత ఫిర్యాదు కమిటీ (ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటి) ఏర్పాటు చేయాల్సి ఉంటుందని జిల్లా సంక్షేమ శాఖాధికారి ఆదేశించారు. ఆయా సంస్థల్లో పనిచేసే మహిళా కార్మికులు, ఉద్యోగినులు సహచర ఉద్యోగులచే ఎలాంటి లైంగిక వేధింపులకు గురైనా అదే సంస్థలో ఉండే కమిటీకి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. దీంతోపాటు జిల్లాలో లోకల్ కంప్లెయింట్స్ కమిటీ సైతం ఏర్పాటు చేసామన్నారు. మహిళా ఉద్యోగినుల భద్రతకోసం భారత ప్రభుత్వం తీసుకొని వచ్చిన ఈ చట్టం కార్యాలయాల్లో పనిచేసే మహిళలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించటమే అని తెలిపారు. పదిమంది కంటె తక్కువ ఉద్యోగులున్న సంస్థకు చెందిన బాధిత మహిళలు జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదే విధంగా బాధిత మహిళలు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు https://shebox.wcd.gov.in అందుబాటులో తెచ్చిందన్నారు. ఈ చట్టం సక్రమంగా అమలయ్యేందుకు గాను రెవెన్యూ డివిజిన్ అధికార్లు, మండల రెవెన్యూ అధికారులు, ఎఎంసిలో నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు.




## అక్రమంగా జెసిబితో కాలువ తీస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల పరిధిలోని చించల్‌పేట్ గ్రామానికి చెందిన మునుగాల నాగరాజు అక్రమంగా జెసిబి సహాయంతో కాలువలు తవ్వి, చించల్‌పేట్ గ్రామం నుండి మండల కేంద్రానికి వెళ్లే రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాడని చిట్టిగిద్ద గ్రామ సర్పంచ్ పోతు రాజు శ్రీధర్, చించల్ పేట్ గ్రామ సర్పంచ్ జీ.అనసూయ అనంతరాములు ఆరోపిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, అక్నాపూర్, అత్తాపూర్, చించల్ పేట్ గ్రామ ప్రజలకు ఉపయోగపడే సాధారణ మార్గాలను అనుమతులు లేకుండా కాలువల రూపంలో తవ్వడం వల్ల పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, అత్యవసర సేవల కోసం వెళ్లే ప్రజ లు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కూరగాయలు, పంటసాగు దిగుమతులకోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అలాగే ప్రభుత్వ భూములు, గ్రామ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా అక్రమ పనులు జరుగుతున్నాయని, నక్షలో వున్న దారి ని తవ్వి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై తక్షణ విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో చిట్టిగిద్ద సర్పంచ్ పోతు రాజు శ్రీధర్, చించల్ పేట్ ఉప సర్పంచ్ బాల్ రాజు, నాయకులు జి.అనంతరాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం తూంకుంటలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన శాఖను నాబార్డ్ తెలంగాణ సిజిఎం దయ్ బాస్కర్‌తో కలిసి టిజిబి చైర్మన్ కె ప్రతాపరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయ్‌బాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 941 శాఖలతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలందిస్తు ఎస్‌బిఐ తర్వాత తెలంగాణలో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా నిలిచిందన్నారు. తూంకుంట శాఖ ప్రారంభంతో హైద్రాబాద్ నగర పరిధిలో టిజిబి శాఖల సంఖ్య 99కు చేరిందని తెలిపారు. రైతులు చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలకు, యువ పారిశ్రామిక వేత్తలకు, సులభ రుణాలు అందించడమే బ్యాంక్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం ఉదయ్‌కిరన్, ఎస్ఎంబికే విజేందర్, ఎస్ఎంఓ సత్యవేణి, తూంకుంట బ్యాంక్ మేనేజర్ అజేష్‌కుమార్ పాల్గొన్నారు.

